లోవ రాజగోపురం శిఖరప్రతిష్ఠ

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: తలుపులమ్మ లోవ దేవస్థానంలో నూతనంగా 108 దేవతామూర్తులతో వంద అడుగుల ఎత్తులో నిర్మించిన రాజగోపురం శిఖర కలశప్రతిష్ఠ కార్యక్రమాన్ని బుధవారం వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తుని రాజా కుటుంబీకులు, వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారికి మహానివేదన సమర్పించారు. అనంతరం రాజగోపురంపై కలశస్థాపన కార్యక్రమాన్ని వేదపండితులు చేశారు.

శిఖర ప్రతిష్ఠలో నాయకులు, భక్తులు

అమ్మవారికి మహానివేదన

జేఎన్‌టీయూకేలో విప్రో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్

గాంధీనగర్: విప్రో, ఎన్ఐఆర్‌సీఏలతో చేసుకునే ఒప్పందాలతో విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుందని జేఎన్‌టీయూకే ప్రిన్సిపల్ కె.పద్మరాజు అన్నారు. విప్రో వైస్ ప్రెసిడెంట్ శేషుకుమార్, ఎన్ఐఆర్‌సీఏ డైరెక్టర్ ఎం.శేషమాధవ్‌లు బుధవారం జేఎన్‌టీయూకేను సందర్శించారు. వివిధ అంశాలపై ప్రిన్సిపల్‌తో చర్చించారు. విప్రో వైస్ ప్రెసిడెంట్ శేషుకుమార్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందంలో భాగంగా విప్రో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

ఎర్రగా ఎందుకు.. పచ్చగా వెళ్దాం..

జాతీయ రహదారుల్లో వీఏఎస్‌డీ బోర్డులు

దేవరపల్లి, న్యూస్‌టుడే: జాతీయ రహదారులపై అతి వేగం ప్రమాదాలకు కారణమవుతోంది. వాహనాలు ప్రయాణించే వేగాన్ని చూపించి, చోదకులను అప్రమత్తం చేసేందుకు వెహికల్ యాక్టివేటెడ్ స్పీడ్ డిస్‌ప్లే (వీఏఎస్‌డీ) బోర్డులను ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో ప్రతి 20 కిలోమీటర్లకు ఒకటి చొప్పున సుమారు 15 చోట్ల వీటిని అమర్చారు. రాజమహేంద్రవరం జాతీయ రహదారుల సంస్థ ప్రాజెక్టు పరిధిలో తూర్పు గోదావరి, కాకినాడ, డా.బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో 16, 216, 216ఏ, 365బీజీ జాతీయ రహదారులు సుమారు 377 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి.


కొవ్వూరు-గుండుగొలను మధ్య 171 కి.మీ. వేగంతో ప్రయాణించిన కారును గుర్తించారిలా..

ఇలా గుర్తిస్తారు..

మితిమీరిన వేగంతో వాహనం వెళితే డిస్‌ప్లేలో ఎరుపు రంగులో వాహన వేగం కనిపిస్తుంది. అప్పుడు వెంటనే చోదకుడు వేగాన్ని నియంత్రించాల్సి ఉంటుంది. అదే నిర్ణీత వేగం ఉంటే ఆకుపచ్చ రంగులో చూపిస్తుంది.

నిర్ణీత వేగమే ఉండాలి

నిర్ణీత వేగంతో ప్రయాణిస్తే ప్రమాదాలు జరగవు. వీఏఎస్‌డీ వాహనం వేగాన్ని గుర్తించి ఎరుపు, పచ్చ రంగుల్లో తెలియజేస్తుంది. అతి వేగంగా ప్రయాణిస్తే రావాణా, పోలీస్ శాఖలకు సమాచారం వెళ్లి జరిమానా విధించే అవకాశం ఉంటుంది.

- బి.కృష్ణమూర్తి, పీడీ, జాతీయ రహదారుల సంస్థ

ప్రాజెక్టు పరిధిలో జాతీయ రహదారులు

రహదారి (నంబరు)	కిలోమీటర్లు	నిర్ణీత వేగం
అన్నవరం-దివాన్‌చెరువు (16)	70	80
దివాన్‌చెరువు-సిద్ధాంతం (216ఏ)	49	80
సిద్ధాంతం-గుండుగొలను (216ఏ)	71	80
కొవ్వూరు-గుండుగొలను (16)	69	80-100
దేవరపల్లి-ఖమ్మం (365బీజీ)	29	100

ఉద్యోగులు కొన్నారు.. అక్రమార్కులు కొట్టేశారు

చర్యలపై యంత్రాంగం మీనమేషాలు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: వారంతా ప్రభుత్వ ఉద్యోగులు. సొసైటీగా ఏర్పడి భూములు కొనుగోలు చేశారు. కొంతమంది బాగానే రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. మరికొంత మంది చేయించుకోలేదు. ఇదే అదనుగా కొంతమంది అక్రమార్కులు తప్పుడు పత్రాలతో కాజేసేందుకు ఎత్తు వేశారు. గత ప్రభుత్వ హయాంలో అధికారం అడ్డుపెట్టుకొని దొంగపత్రాలతో భూమాఫియాకు తెరలేపారు. ఏకంగా రూ.300కోట్లకు పైగా విలువైన భూమి కబ్జా కోరల్లో చిక్కుకున్నా యంత్రాంగం చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తుండటం గమనార్హం.

అప్పటి అధికారుల సహకారంతో..

1970లో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు సొసైటీగా ఏర్పడి రాజమహేంద్రవరంలోని భాస్కర్‌నగర్ కాలనీలో 36 ఎకరాలను కొనుగోలు చేసి ప్లాట్లుగా విభజించారు. అప్పట్లో కొంతమంది మాత్రమే నేరుగా రిజిస్ట్రేషన్ చేయించుకొన్నారు. కొంత కాలానికి సొసైటీ నడపకపోవడంతో సహకార శాఖ స్వాధీనం చేసుకుంది. ఆ శాఖలో కొంతమంది అధికారుల అండతో రిజిస్ట్రేషన్ ఉద్యోగుల సాయంతో ఖాళీగా ఉన్న ప్లాట్లకు దొంగ పత్రాలు సృష్టించారు. ఇతరుల పేర్లతో రిజిస్ట్రేషన్లు చేయించారు. గతంలో పనిచేసిన కొందరు అధికారులు దీనికి బాధ్యులుగా ఉన్నారు. ఇందులో భారీ మొత్తంలో నగదు చేతులు మారింది.

రూ.కోట్ల విలువైన భూముల్లో పెరిగిన చెట్లు, తుప్పలు

రూ.కోట్లలో విలువ..

ఈ విషయం రెండున్నర ఏళ్ల క్రితం వెలుగులోకి వచ్చింది. ఇప్పటివరకు బాధితులకు న్యాయం జరగలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తొలిసారిగా జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే విచారణకు ఆదేశించింది. ప్రాథమిక విచారణ పూర్తి చేసి అప్పటి జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. ఖరీదైన భూముల విషయంలో అక్రమాలు జరిగాయనడానికి ఆధారాలు లభ్యమయ్యాయి. అప్పటి సొసైటీ లిక్విడేటరు, సబ్ రిజిస్ట్రార్, కొంతమంది సహకార సంఘ ఉద్యోగులు ఉన్నట్లు గుర్తించారు. వీరిలో కొందరికి 2 నుంచి 3 ప్లాట్లు దక్కాయి. ఇవి ఒక్కొక్కటి రూ.2కోట్లకు పైగా విలువ చేస్తుంది.

నివేదికలో చెప్పినా..

మొత్తం 36 ఎకరాలను 278 ప్లాట్లుగా విభజించారు. అందులో 135 ప్లాట్లు సక్రమంగా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. మిగిలిన వాటిలో అక్రమాలు జరిగాయి. నకిలీ ధ్రువీకరణ పత్రాలు, రిజిస్ట్రేషన్లు, పేర్లు మార్చి కొట్టేశారు. ఈ నివేదికను ప్రభుత్వానికి పంపించారు. ఒక దశలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారి నుంచి ప్రభుత్వం పత్రాలను సేకరించింది. అప్పటికే కలెక్టర్ బదిలీ కావడంతో పరిస్థితి మొదటికొచ్చింది. ఓపక్కన విచారణ పేరుతో కాలయాపన జరుగుతుంటే మరోవైపు అసలైన రికార్డులను మార్చి కొత్తవాటిని సృష్టించి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం దీనిపై దృష్టి పెట్టాలనే వాదన గట్టిగా వినిపిస్తోంది.

కిట్టు.. గుట్టు పట్టేట్టు..!

పోలీసుల వద్ద డ్రగ్ డిటెక్షన్ పరికరాలు

న్యూస్‌టుడే, కంబాలచెరువు (రాజమహేంద్రవరం)

గంజాయి, మాదకద్రవ్యాలు తీసుకుంటే ఎవరికి చిక్కుతాములే అనుకుంటే పొరపాటే. గంజాయి, డ్రగ్స్ తీసుకున్న వారు ఇకపై తప్పించుకోలేరు. జిల్లా పోలీసుల వద్ద 500 డ్రగ్ డిటెక్షన్ కిట్లు అందుబాటులోకి వచ్చాయి. మత్తు రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో పనిచేస్తున్న యంత్రాంగానికి కొత్త ఆయుధంగా పనిచేస్తున్నాయి. దీంతో ప్రత్యేక కార్యాచరణతో పోలీసులు ముందుకెళ్తున్నారు. రౌడీషీటర్లు, గంజాయి విక్రేతలు, అనుమానాస్పద వ్యక్తుల వద్ద, ఇళ్లల్లో తనిఖీలు చేపడుతున్నారు.

100 మందికి పరీక్షలు..

జిల్లాలోని అయిదు సబ్ డివిజన్లలో ఇప్పటివరకు 100 మందికి డ్రగ్ డిటెక్షన్ కిట్లతో పరీక్షలు చేయగా 38 మంది మత్తు పదార్థాలు తీసుకున్నట్లు తేలింది. ఎనిమిది మందిని అరెస్టు చేశారు. 20 మందిని కౌన్సెలింగ్ నిమిత్తం వ్యసన విముక్తి కేంద్రాలకు పంపించారు. వీరికి ఎక్కడి నుంచి వస్తున్నాయో కూపీ లాగి వారిపైనా కఠిన చర్యలకు ఉపక్రమిస్తున్నారు.

వీరిపై నిఘా..

మత్తు పదార్థాల అలవాటున్న వ్యక్తులను వెంటనే గుర్తించేందుకు ఇబ్బంది ఏర్పడేది. దీని ద్వారా నేరస్థులు తప్పించుకునేందుకు అవకాశం ఉండేది. ఇకపై డ్రగ్ డిటెక్షన్ కిట్ల ద్వారా అనుమానితులకు మూత్ర పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అయిదు సబ్ డివిజన్లలో గంజాయి కేసుల్లో నిందితులు, రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్లలో ఉన్నవారికి పరీక్షలు చేస్తారు. మత్తుకు అలవాటు పడిన వారిని కనిపెడతారు. మద్యం తాగిన వారిని బ్రీత్ ఎనలైజర్‌తో పట్టుకుంటారు. దీనికి సంబంధించి ఒక జిల్లాస్థాయి, అయిదు సబ్ డివిజన్ల స్థాయిలో ఈగల్ బృందాలు పనిచేస్తున్నాయి.

మత్తు రహితంగా మారుస్తాం..

గంజాయి, మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. ఇందులో భాగంగా జిల్లాలోని విద్యాసంస్థల్లో 970 ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేశాం. 16 మందిపై పిట్ ఎన్డీపీఎస్ చట్టం, ఆరుగురిపై పీడీ చట్టం అమలు చేశాం. నిరంతరం డ్రోన్లతో పర్యవేక్షిస్తున్నాం. అన్ని సబ్‌డివిజన్లలో పరీక్షలు చేసి పాజిటివ్ వచ్చిన వారిని విచారిస్తున్నాం.

- డి.నరసింహకిషోర్, జిల్లా ఎస్పీ

గోదావరికి జలకళ

విజ్జేశ్వరం వద్ద బుధవారం గోదావరిలో జలకళ ఉట్టిపడింది. ఇంత వరకు పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు లేక నదిలో ఇసుక దిబ్బలు తేలాయి. మహారాష్ట్రలోని గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కురిసిన భారీవర్షాలకు ఎగువ నుంచి వరదనీరు వచ్చి చేరుతుండటంతో కాటన్ ఆనకట్ట వద్ద ఇసుక దిబ్బలు పూర్తిగా నీట మునిగి జలకళను సంతరించుకుంది. **- న్యూస్‌టుడే, నిడదవోలు**

సౌర వెలుగుల బాట పడదాం!

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 5 మెగావాట్ల ప్లాంట్

ఈనాడు, రాజమహేంద్రవరం: 'ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగంపై దృష్టి సారించాలి..సంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి పొదుపు మంత్రం పాటించాలి..' ముఖ్యమంత్రి చంద్రబాబు పలుదఫాలు ఇచ్చిన పిలుపు ఇది. ఈ మాటలను ఆచరణలో పెట్టేందుకు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ శ్రీకారం చుట్టింది. 5 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మించి ఏడాదికి సుమారు రూ.3.5 కోట్ల మేర ఆదా చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ నెలలోనే పనులకు శ్రీకారం చుట్టి సెప్టెంబరునాటికి అందుబాటులోకి తీసుకురావాలన్న యోచనలో ఉన్నారు.

మూడు సంస్థల మధ్య ఒప్పందం

- కొవ్వూరు పరిధి దొమ్మేరులోని 5.77 ఎకరాల్లో 1.5 మెగావాట్ల ప్లాంట్, ధర్మవరం మలక్‌పల్లిలోని 9.38 ఎకరాల్లో 3.5 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటు చేస్తారు. వీటి ద్వారా 75 లక్షల మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేస్తారు.
- నగర పాలక సంస్థ ఏడాదికి సగటున 22.8 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగానికి సంబంధించి యూనిట్‌కు రూ.8 చొప్పున చెల్లిస్తోంది. అంటే ఏడాదికి రూ.18 కోట్లు.
- ప్లాంట్ ఏర్పాటు, నిర్వహణకు సంబంధించి నగర పాలక సంస్థ, ఏపీ ఈపీడీసీఎల్, ఆంధ్రా పవర్ మధ్య ఒప్పందం జరిగింది. నగరపాలక సంస్థ స్థలాలు ఇస్తుండగా, ఆ సంస్థ ప్లాంట్ ఏర్పాటు.. నిర్వహణ చూస్తుంది. విద్యుత్తును ఆ శాఖ తీసుకుంటుంది. ప్రస్తుతం ప్లాంట్ నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్తును నగరపాలక సంస్థ వినియోగిస్తే యూనిట్‌కు రూ.3.5 (యూనిట్‌కు రూ.4.5 ఆదా) చెల్లించనుంది. 25 ఏళ్ల వరకు ఆ సంస్థ నిర్వహణ చేసి, తర్వాత ప్లాంట్‌ను నగరపాలక సంస్థకు అప్పగించాలి. దీంతో ఏడాదికి సుమారు రూ.3.5కోట్ల మేర 25 ఏళ్లు విద్యుత్తుకు చేసే ఖర్చు తగ్గుతుంది.

కాకినాడ | ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్
(పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ యొక్క 100% సంపూర్ణ యాజమాన్య అనుబంధ సంస్థ)B-9, కుతుబ్ ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా, కట్వారియా సరాయ్, న్యూఢిల్లీ-110016

నోటీసు

(విద్యుత్ చట్టం, 2003 లోని సెక్షన్ 15 యొక్క సబ్-సెక్షన్ (2) ప్రకారం)

కంపెనీల చట్టం, 2013 కింద నమోదై, **B-9, కుతుబ్ ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా, కట్వారియా సరాయ్, న్యూఢిల్లీ-110016** వద్ద తన రిజిస్టర్డ్ ఆఫీసును కలిగి ఉన్న **కాకినాడ | ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్**, విద్యుత్ చట్టం, 2003 లోని సెక్షన్ 15 యొక్క సబ్-సెక్షన్ (1) ప్రకారం కింద పేర్కొన్న వివరాలు గల ట్రాన్స్‌మిషన్ లైన్లు, సబ్-స్టేషన్లు మరియు ఇతర ఆస్తులకు సంబంధించి ట్రాన్స్‌మిషన్ లైసెన్స్ మంజూరు కోసం న్యూఢిల్లీలోని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి) ఎదుట దరఖాస్తు చేసుకుంది:

క్రమ సంఖ్య	ట్రాన్స్‌మిషన్ ఆస్తులు మరియు ప్రాంతం	లైన్ పొడవు/సామర్థ్యం	అంచనా వ్యయం/పూర్తయ్యే ఖర్చు	షెడ్యూల్డ్ సిఓడీ (COD)	రిమార్కులు
1	కాకినాడ సబ్-స్టేషన్ వద్ద వేమగిరి - శ్రీకాకుళం 765 kV D/c లైన్ యొక్క LILO (~20 కి.మీ.) {శ్రీకాకుళం - కాకినాడ సెక్షన్ (~334 కి.మీ.) పై కాకినాడ GH ఎండ్ వద్ద 240 MVAr SLRతో}~	20 కి.మీ. కాకినాడ-2 వద్ద 765 kV, 240 MVAr SLR - (6x80 MVAr స్విచబుల్ యూనిట్లు)	రూ.1618.5 కోట్లు	29.12.2028	
2	240 MVAr బస్ రియాక్టర్‌తో పాటు కాకినాడ 765/400 kV, 3x1500 MVA సబ్-స్టేషన్ (GIS) ఏర్పాటు. భవిష్యత్తు ఏర్పాట్లు 765/400 kV, 1500 MVA, ICTs - 3 నంబర్లు. 765 kV ICT బేలు - 3 నంబర్లు 400 kV ICT బేలు - 3 నంబర్లు 765 kV లైన్ బేలు - 8 నంబర్లు (SLR నిబంధనతో) 400 kV లైన్ బేలు - 12 నంబర్లు (SLR నిబంధనతో) 400 kV బస్ సెక్షనలైజర్: 1 సెట్	3x1500 MVA, 765/400 kV ICT (1 విడి యూనిట్‌తో కలిపి 10x500 MVA) 765 kV ICT బే - 3 నంబర్లు (GIS) 400 kV ICT బే - 3 నంబర్లు (GIS) 765 kV లైన్ బేలు - 4 నంబర్లు (GIS) (శ్రీకాకుళం - వేమగిరి 765 kV D/c లైన్ యొక్క LILO ముగింపు కోసం కాకినాడ వద్ద) 765 kV, 240 MVAr బస్ రియాక్టర్ - 1 నంబర్ (బస్ రియాక్టర్ మరియు లైన్ రియాక్టర్ రెండింటికీ 1 స్విచబుల్ స్పేర్ యూనిట్‌తో కలిపి 4x80 MVAr) 765 kV బస్ రియాక్టర్ బేలు - 1 నంబర్ (GIS)			
3	ప్రతిపాదిత 1x240 MVAr బస్ రియాక్టర్ కోసం కంట్రోల్ స్విచింగ్ అమరికతో కాకినాడ 765/400 kV GIS S/s వద్ద 2x125 MVAr MSCతో కూడిన +/- 300 MVAr STATCOM. కాకినాడ 765/400 kV S/s వద్ద 2x125 MVAr MSCతో కూడిన 2వ + 300 MVAR STATCOM కోసం స్థల నిబంధన.	400 kV బే - 1 నంబర్ (GIS)*			

2. కమిషన్ ఎదుట దాఖలు చేసిన పూర్తి దరఖాస్తు మరియు ఇతర పత్రాలు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వెబ్‌సైట్ **www.powergrid.in/subsidiaries**లో ఎవరైనా పరిశీలించడానికి అందుబాటులో ఉన్నాయి. ఈ దరఖాస్తును కంపెనీ కార్యాలయం: C/o ED (కమర్షియల్ & RC), పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, ఫ్లోర్ నెం. 02, టవర్-01, ఇర్కాన్ ఇంటర్నేషనల్ టవర్, ప్లాట్ నెం. 16, ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా, సెక్టార్-32, గుర్గావ్-122003 వద్ద లేదా కమిషన్ నిర్దేశించిన విధానం ప్రకారం కమిషన్ కార్యాలయంలో కూడా పరిశీలించవచ్చు.
3. అభ్యంతరాలు లేదా సూచనలు ఏవైనా ఉంటే, వాటిని వార్తాపత్రికలో ఈ నోటీసు ప్రచురించబడిన 15 రోజులలోపు, కార్యదర్శి, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్, 6వ, 7వ & 8వ అంతస్తులు, టవర్ B, వర్ల్డ్ ట్రేడ్ సెంటర్, నౌరోజీ నగర్, న్యూఢిల్లీ 110029 గారికి సమర్పించాలి. అలాగే ఆ అభ్యంతరం(లు)/సూచన(ల) యొక్క ఒక ప్రతిని (కాపీని) దరఖాస్తుదారునికి లేదా వారి అధీకృత ప్రతినిధికి పంపాలి.

స్థలం: కాకినాడ
తేదీ: 09.07.2026
ప్రాజెక్ట్ ఇన్‌చార్జ్,
కాకినాడ | ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్

బుడిబుడి అడుగులు.. బుద్ధికి మెరుగులు

అంగన్‌వాడీలో చిన్నారుల వికాసంపై ప్రత్యేక దృష్టి

హుకుంపేట, న్యూస్‌టుడే: అంగన్‌వాడీల్లో చిన్నారుల చదువు, ఆరోగ్యం, ప్రాథమిక విద్యపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాయి. పోషణ్ బీ.. పడాయీ బీ రాష్ట్రస్థాయి మాస్టర్ ట్రైనర్ల శిక్షణ కార్యక్రమం బొమ్మూరులో జరుగుతోంది. ఉభయ గోదావరి జిల్లాల నుంచి ముగ్గురు ఏసీడీపీవోలు, 14 మంది సీడీపీవోలు, 119 మంది సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. వీరు ఇక్కడ నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో నేర్పిస్తారు.

శిక్షణలో సూచనలు చేస్తున్న పీడీ శ్రీదేవి

ఈ అంశాలపై శిక్షణ..

● పిల్లల ఎదుగుదల, తెలివితేటలు, ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఇంటింటికీ వెళ్లి వివరించే అంశాలు. ● చదువు, ఆరోగ్యం, ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్యపై దృష్టి సారించే పద్ధతులు. ● అందుబాటులోని ఆట వస్తువులతో పిల్లలతో సృజనాత్మకంగా ఆడించే విధానాలను వివరించడం. ● అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ. ● నవచేతన యాప్‌లో స్క్రీనింగ్ ప్రక్రియ పూర్తి చేసే విధానం.

ఈనెల నుంచి

ఆర్‌బీఎస్‌కే 2.0 స్క్రీనింగ్‌లో భాగంగా పిల్లల్లో ఎదుగుదల లోపాలు, వ్యాధులు, జన్యుపరమైన ఇబ్బందులు, తదితర సమస్యలను గుర్తిస్తారు. ఈనెల నుంచి వచ్చే ఏడాది వరకు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పరీక్షలు చేస్తారు. జీజీహెచ్‌లోని జిల్లా సత్వర చికిత్స కేంద్రంలో చికిత్స అందిస్తారు.

బాల్యదశలోనే గుర్తిస్తే..

బాల్యదశలోనే సమస్యలను గుర్తిస్తే తగిన వైద్యం అందించొచ్చు. పిల్లల ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్ శాతం, కళ్లు, వినికిడి, దంత పరీక్షలు నిర్వహిస్తారు. ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు యాప్‌లో వివరాలు నమోదు చేస్తారు. దాని బట్టి చికిత్స ఉంటుంది. **- డాక్టర్ జి.హరిశ్చంద్రప్రసాద్, ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్**

తాడిపూడి ఎత్తిపోతల నుంచి నీరు విడుదల

తాళ్లపూడి, న్యూస్‌టుడే: మండలంలోని తాడిపూడి ఎత్తిపోతల పథకం నుంచి సాగునీటిని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు బుధవారం చేశారు. తొలుత వేదపండితులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. స్టేజ్-1 మోటారు పంపు వద్ద మంత్రితోపాటు కొవ్వూరు, గోపాలపురం ఎమ్మెల్యేలు ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకటరాజు ప్రత్యేక పూజలు చేశారు. గోదావరి నదికి పసుపు, కుంకుమ, పుష్పాలతో పూజలు చేసి పాడిపంటలతో రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుతూ తాంబూలం సమర్పించి, హారతులు ఇచ్చారు. మంత్రి రామానాయుడు మోటార్ స్విచ్ ఆన్‌చేసి పంపుల ద్వారా గోదావరి నీరు విడుదల చేశారు. పథకం పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జలవనరులశాఖ డీఈలు రామేశ్వరనాయుడు, అప్పారావు, అధికారులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పూజ చేస్తున్న మంత్రి రామానాయుడు, ఎమ్మెల్యేలు మద్దిపాటి, ముప్పిడి

వైద్యుల ఖాళీల భర్తీకి ముఖాముఖి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ప్రభుత్వాసుపత్రుల్లో ఒప్పంద ప్రాతిపదికన వైద్యుల ఖాళీల భర్తీకి ముఖాముఖి నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య సేవల సమన్వయాధికారిణి (డీసీహెచ్ఎస్) ఎం.పద్మ తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 19 సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఖాళీలను భర్తీ చేయాల్సి ఉందన్నారు. ఈనెల 10న కొవ్వూరులోని తమ కార్యాలయంలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట లోగా హాజరు కావాలన్నారు. విద్యార్హత, వయోపరిమితి, రిజర్వేషన్లు, ఎంపిక విధానం, ఇతర వివరాలు : హెచ్‌టీటీపీ ఈస్ట్‌గోదావరి.ఏపీ.జీవోవీ.ఇన్, కాకినాడ.ఏపీ.జీవోవీ.ఇన్, కోనసీమ.ఏపీ.జీవోవీ.ఇన్‌లో తెలుసుకోవచ్చన్నారు.

14లోగా పత్రాలు సమర్పిస్తేనే జాబితాలో పేరు

కలెక్టరేట్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: సర్‌లో భాగంగా ఓటర్లకు అందించిన ఎన్యూమరేషన్ ఫారాలు (ఈఎఫ్‌లు)ను పూర్తిగా నింపి 14లోగా తప్పనిసరిగా బీఎల్వోలకు సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కీర్తి చేకూరి విజ్ఞప్తి చేశారు. ఈఎఫ్‌లు తిరిగిచ్చిన వారి పేర్లు మాత్రమే ఈనెల 21న ప్రచురించే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పొందుపరుస్తామని స్పష్టం చేశారు. బుధవారం రాజమహేంద్రవరంలోని క్యాంపు కార్యాలయంలో జేసీ వై.మేఘాస్వరూప్‌తో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.

సూచనలు చేస్తున్న కలెక్టర్, జేసీ

సొంతంగా చేసుకోవచ్చు:

ఉద్యోగ, ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న ఓటర్లు కూడా https://voter.eci.gov.in వెబ్‌సైట్ లేదా ఈసీఐ నెట్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో ఎన్యూమరేషన్ ఫారాన్ని సమర్పించవచ్చు. 'బుక్ ఏ కాల్ బీఎల్వో' సదుపాయంతోనూ సేవలు పొందవచ్చు.

ప్రత్యేక సహాయ కేంద్రాలు

ఎన్యూమరేషన్ ఫారాలు నింపడంలో సందేహాలుంటే హెల్ప్‌లైన్ 1950, జిల్లా కంట్రోల్ రూమ్ నంబరు 0883-2944455, జిల్లా హెల్ప్‌డెస్క్ నంబర్లు 9347794619, 9505136146లను సంప్రదించవచ్చు.

11 రకాల గుర్తింపు పత్రాలు:

ప్రస్తుతం ప్రతి ఓటరు వివరాలను 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ చేస్తున్నారు. ఒకవేళ 2002 జాబితాలో మ్యాపింగ్ కాకపోతే 'నో మ్యాపింగ్' గా నమోదు చేస్తారు. అటువంటి ఓటర్ల పేర్లు కూడా డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఉంటాయి. అనంతరం వారికి ప్రత్యేక నోటీసులు జారీ చేస్తారు. వాటికి ప్రతిస్పందనగా ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకటి సమర్పించి భారత పౌరసత్వాన్ని నిరూపించుకోవాల్సి ఉంటుంది.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669